www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 జులై 2025
5
కాకినాడ



ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

వాహనాలపై వెళ్లే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ వి.మౌనిక అన్నారు. శనివారం స్థానిక దర్గా సెంటర్ పరిసర ప్రాంతాలలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేకమంది హెల్మెట్లు లేకుండానే ప్రయాణాలు చేస్తున్నారన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడంతో మృత్యువాత పడుతున్నారని అన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారు,హెల్మెట్ లేని వారు, ర్యాష్ డ్రైవింగ్ వాహనదారులకు జరిమానాలు విధించారు.


వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

పేదల ఇంట ధరల మంట

-మండుతున్న కూరగాయల ధరలు
-దిగుబడి తగ్గుదలే కారణమంటున్నవ్యాపారులు
-గగ్గోలు పెడుతున్న సామాన్యులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఏ కాలమైనా కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఇదేం ధరలని ప్రశ్నిస్తే భారీ వర్షాలు, వరదలు, కొన్ని చోట్ల అనావృష్టితో కూరగాయల సాగు తగ్గిందని, ఉత్పత్తి పడిపోయిందనే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఎప్పుడూ లేనంతగా గత కొన్ని నెలలుగా ధరల బాదుడు మామూలుగా లేదు. పచ్చిమిర్చి, ఉల్లి, టమాటా, వంకాయ, బంగాళాదుంప తదితర కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి.

దళారులకే లాభాలు

కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 35 వేల ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతుంది. అయితే గత ఆరు నెలల నుంచి దిగుబడులు ఆశించిన స్థాయిలో వచ్చినప్పటికీ ధరలు తగ్గిపోయిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలు సాగు చేసిన రైతులు నష్టపోయారు. ప్రస్తుతం సాగు సీజన్ అంతగా లేదు. మరోవైపు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పంటలు దిగుబడి క్రమంగా తగ్గిపోతుంది. దీంతో ధరలు పెరుగుదల అనివార్యంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి దిగుబడులు తగ్గుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఇదే అదునుగా భావిస్తున్న దళారులు మాత్రం లాభాలను ఆర్జిస్తున్నారు. రైతులకు దక్కుతున్నది తక్కువ, దళారులు దండుకుంటున్నదే ఎక్కువగా ఉంటుంది. క్షేత్రస్థాయిలో వాస్తవ ధరలను పరిశీలిస్తూ ధరల నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సామాన్యులకు చుక్కలు

ఏ ధరలు పెరిగినా మొదటి ప్రభావం పడేది సామాన్యుల పైనే. ఎక్కడైనా గాని అనేక కుటుంబాలు ధరల ప్రభావంతో విలవిలలాడుతున్నాయి. ప్రస్తుతం వాతావరణ మార్పులు, దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడం వంటి కారణాలతో కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గత నెల రోజుల క్రితం వరకు బహిరంగ మార్కెట్లో సరైన ధరలు లేకపోవడంతో ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దిగుబడులు లేక ఆందోళన చెందుతున్నారు. గత పది రోజుల నుంచి పోలిస్తే ప్రస్తుతం కూరగాయల ధరలు ఒక్కొక్కటి భారీగా పెరుగుతున్నాయి. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో వరదలు, భారీ వర్షాల వలన పంటలు మరింత దిగుబడి తగ్గే అవకాశం ఉండడంతో ఈ ధరలు ఇంకా ఎక్కువగా పెరగవచ్చునని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా కొన్ని ధరలను పరిశీలిస్తే పచ్చిమిర్చి ఘాటు ఎక్కువైంది. కిలో పది రోజుల క్రితం రూ.40 ఉంటే ప్రస్తుతం రూ.100కి, టమోటా రూ.30 నుంచి 50, వంకాయలు రూ.40 నుంచి 80, బీర రూ.40 నుంచి 70కి, ఉల్లి రూ.25 నుంచి 40కి, అల్లం రూ.70 నుంచి 100కి, చిక్కుడు రూ.80 నుంచి 110కి, బీట్ రూట్ రూ.25 నుంచి 40కి, దొండ రూ.30 నుంచి 40కి, బీర రూ.30 నుంచి రూ.50కి పెరిగాయి. అలాగే కొత్తిమీర, క్యాప్సికం, బంగాళాదుంప, ఆనపకాయ గోరుచిక్కుడు కాలీఫ్లవర్ ఇలా అన్ని ధరలు 50 నుంచి 100 శాతం పెరిగాయి. ఇప్పటికే బియ్యం, పప్పులు, ఆయిల్, గ్యాస్ తదితర ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులకు చుక్కలు చూపెడుతున్నాయి. అదే దారిలో కూరగాయల ధరలు పెరగడంతో మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

హోల్సేల్, రిటైల్ వ్యాపారుల మధ్యే భారీగా ధరల వ్యత్యాసం కనిపిస్తోంది. మధ్య దళారుల ప్రమేయం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ధరలు భారీగా పెరుగుదలకు కారణం అవుతుంది. అయితే కొన్ని ధరలు పెరిగినప్పుడు మాత్రమే వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు సీన్లోకి వస్తున్నారు. రైతుకు పెట్టుబడి వ్యయం ఎంత, వారికి దక్కాల్సిన ధర ఎంత, హోల్సేల్ వ్యాపారుల రైతు దగ్గర ఎంతకు కొంటున్నారు. ఇవేవీ పట్టించుకోవడంలేదు. మరోవైపు రైతు బజార్లు పట్టణాలకే పరిమితమయ్యాయి. దీంతో వినియోగదారులకు భారంగా మారుతుంది. ఈ నేపథ్యంలో మండల కేంద్రాలు కొన్ని పంచాయతీల్లో సైతం రైతు బజార్లను ఏర్పాటు చేయాలని ప్రజల కోరుతున్నారు.



నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్స్ వద్దే వద్దు

-నగర ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ

తమ ఇళ్లకు అదాని ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తే వద్దని చెప్పాలని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం ప్రారంభించారు. శనివారం నగరంలోని సుందరయ్య భవన్ పరిసరాలలో ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం చేసిందని తెలిపారు. ఆ చట్టానికి వైసిపి, టిడిపి రెండు పార్టీలు అనుకూలంగా ఓటు వేసాయన్నారు. దీని ఫలితంగా అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ప్రతి ఇంటికి ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరిందన్నారు. గత ప్రభుత్వ సమయంలో టిడిపి నాయకులు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టాలని పిలుపునిచ్చిన విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. కానీ అదే ఒప్పందం ప్రకారం స్మార్ట్ మీటర్లు బిగించడానికి కూటమి ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం దారుణమన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ స్మార్ట్ మీటరు బిగిస్తే ప్రజలు ముందుగానే సెల్ఫోన్ వలే రీఛార్జ్ చేయించుకోవాలన్నారు. మొబైల్ రీఛార్జ్ డబ్బులు అయిపోగానే మొబైల్ కనెక్షన్ ఆగిపోయినట్లు స్మార్ట్ మీటర్ వల్ల విద్యుత్ సౌకర్యం హఠాత్తుగా ఆగిపోతుందన్నారు. మీటర్‌కి అయ్యే ఖర్చు 9 సంవత్సరాల పాటు అద్దె రూపంలో వినియోగదారులపై భారం పడుతుందన్నారు. రాత్రి 6 గంటల నుంచి 10 గంటల మధ్యలో విద్యుత్ వినియోగిస్తే ఎక్కువ ధర చెల్లించేలా టైం ఆఫ్ ది డే అనే విధానం ఈ ఒప్పందంలో ఉందన్నారు. ఇప్పటికే కరెంటు బిల్లులో రకరకాల పేర్లతో భారీగా ఛార్జీలు వేస్తున్నారని తెలిపారు. కాకినాడ నగరంలో చెత్త పన్నుకు వ్యతిరేకంగా ప్రజలు మాట్లాడటం వల్ల, ప్రజా సంఘాలు, సిపిఎం సహా వామపక్షాలు చేసిన ఆందోళన ఫలితంగా చెత్త పన్ను రద్దు చేశారని గమనించాలన్నారు. అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఇంటికి బిగించడానికి వస్తే వద్దని చెప్పాలని నగర ప్రజలకు సిపిఎం విజ్ఞప్తి చేస్తుందన్నారు. కరెంటు బిల్లులో వివిధ రకాల పేర్లతో వేస్తున్న ఛార్జీలను వ్యతిరేకించాలన్నారు. కరెంట్ ఛార్జీలు చెల్లించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నట్లు ఈ సందర్భంగా కొంతమంది ప్రజలు సిపిఎం బృందం వద్ద వాపోయారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటి సభ్యులు కె.నాగజ్యోతి, మలక వెంకటరమణ, చంద్రమళ్ళ పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాణి పాల్గొన్నారు.

14న యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ నెల 14న కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని ఆదేశించారు.

14 నుంచి ఎంపిపి, జెడ్‌పిటిసిలకు శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మహిళా ఎంపిపిలు, జడ్‌పిటిసి సభ్యులకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో జులై 14 నుంచి 16 వరకు నాయకత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కెఎన్‌వి. ప్రసాదరావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "మార్పు ద్వారా విజేతలు" పేరుతో గత నెల 23 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బ్యాచ్‌ల వారీగా పలు జిల్లాల్లోని పంచాయతీ వనరుల కేంద్రాల్లో ఈ శిక్షణలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిక్షణలో పాలన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ప్రజా ప్రతినిధుల విధులు-బాధ్యతలు, భావవ్యక్తీకరణ వంటి అంశాలపై ప్రాథమికంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. స్థానిక శిక్షణ కేంద్రంలో వసతి, ఇతర అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయని, పాల్గొనబోయే 67 మంది మహిళా ఎంపిపిలు, జడ్‌పిటిసి సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమం

ప్రజాశక్తి - గండేపల్లి



అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆదిత్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలం లోని సూరంపాలెం, యర్రంపాలెం గ్రామాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించే జాతీయ మిషన్‌లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో ఎంబి.శ్రీనివాస్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ డి.కిషోర్, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ఐవి. వీరాంజనేయులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, ప్రవర్తనా మార్పు ప్రాముఖ్యతను వివరించారు.

'బుజ్జిబాబు'కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

ప్రజాశక్తి - గండేపల్లి


డాక్టరేట్‌ను అందుకుంటున్న బుజ్జిబాబు

మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రోనిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పెనుముచ్చి బుజ్జిబాబు డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్‌జిఇసి గుడ్లవల్లేరు ప్రొఫెసర్ ఎం.కామరాజు, జెఎన్‌టియు జివి గురజాడ విజయనగరం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.బాబులు నేతృత్వంలో బుజ్జిబాబు సమర్పించిన పెర్ఫార్మన్స్ ఎవాల్యుయేషన్స్ ఆఫ్ డిజిటల్ ఐఐఆర్ ఫిల్టర్ ఆర్కిటెక్చర్స్ ఫర్‌లో - పవర్ అప్లికేషన్స్' అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డాక్టర్ పి.బుజ్జిబాబు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ జి.శ్రీదేవి, వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది బుజ్జిబాబుకు అభినందనలు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలని నిరసన


ప్రజాశక్తి - సామర్లకోట



కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో పారామెడికల్ విద్యార్థినిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసుల దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. శనివారం స్థానిక అమ్మానమ్మనాయుడు కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో ఐద్వారా నాయకలు మాట్లాడారు. బాలికలు, మహిళలు, పని ప్రదేశాల్లో మహిళల పట్ల ఈ మధ్యకాలంలో లైంగిక వేధింపులు అధికం అవుతున్నాయని అన్నారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్ పారామెడికల్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వారి ని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వరలక్ష్మి డిమాండ్ చేశారు. దిశా చట్టాలు లాంటివి ఎన్ని వచ్చినా వేదింపులు పెరుగుతూనే ఉన్నాయని అన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి సత్వరమే దోషులను శిక్షించాలని సిఐటియు నాయకురాలు టి.నాగమణి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.సూర్యకళ, సిహెచ్.రాజులమ్మ, సూర్యకళ, ఐ.దుర్గ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - శంఖవరం


సత్యదేవుని సన్నిధిలో ఉన్నతాధికారులు

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారి రవివర్మ, రాష్ట్ర జిఎస్‌టి అధికారి హరేరామ్ కొండపైకి విచ్చేశారు. వీరికి దేవస్థానం అధికారులు ఆలయ లాంచనాలతో స్వాగతించారు. స్వామివారి దర్శనం అనంతరం వీరికి స్వామి తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందించారు.

పట్టణంలో విద్యుత్ కోతలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఎండ తీవ్రత, మరోపక్క అనధికార విద్యుత్ కోతలతో పట్టణంలో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఒకవేళ కరెంటు వచ్చిన లో వోల్టేజ్‌తో ఫ్యాన్లు తిరగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు ఈ సమస్యను గుర్తించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు కుటుంబాల దత్తత

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎంపిడిఒ డి.శ్రీలలిత రెండు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని వడ్లమూరు గ్రామానికి చెందిన మడికి బుల్లప్ప, గొంపా రాజు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఆ కుటుంబాలను కలుసుకుని వారి అవసరాలను, సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు.

కాగితపు సంచులతో కాలుష్య నివారణ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

కాగితపు సంచులతో ప్లాస్టిక్ కాలుష్యం నివారణ సాధ్యపడుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల స్థానే కాగితపు సంచుల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జూలై 12న కాగితపు సంచుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. గతంలో కిరాణా తదితర వస్తువులు కొనుగోలు చేస్తే కాగితపు సంచలలోనే కట్టి ఇచ్చేవారని అన్నారు. కానీ నేడు ప్లాస్టిక్ సంచులు సౌలభ్యంగా ఉండటం, తక్కువ ఖర్చుతో లభించడంతో వాటిని వినియోగిస్తున్నారని అన్నారు. ఈ సంచులు పర్యావరణానికి హాని చేస్తున్నాయని అన్నారు. పర్యావరణ ఆందోళనతో ఇప్పటికే పలు దేశాలు కాగితపు సంచుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని కాగిత సంచులను వినియోగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు వెండి చీర

ప్రజాశక్తి - తాళ్లరేవు


వెండి చీరను అందిస్తున్న దాతలు

గ్రామదేవత ముత్యాలమ్మకు జొన్నలగడ్డ రామం కుమారుడు విశ్రాంత మిలిటరీ ఉద్యోగి సూర్యనారాయణ మూర్తి రూ.3 లక్షల విలువ చేసే వెండి చీర ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కొలను సత్తిబాబు, రామకృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు రచ్చ కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి సభ్యులు గంజా సూరిబాబు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పంతంకు ఘన నివాళి

ప్రజాశక్తి - పెద్దాపురం


పద్మనాభం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ మంత్రి పంతం పద్మనాభం 26వ వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని కాండ్రకోట గ్రామ సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సోషలిస్టుగా, కమ్యూనిస్టుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆయన కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎంఎల్‌ఎగా, మంత్రిగా పనిచేసి ప్రజా సేవకుడిగా, విలువలతో కూడిన రాజకీయ వేత్తగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జోకా నానాజీ, రెడ్డి బాబులు, గవరసాన రాజశేఖర్, ఊటా రాజబాబు, ఒబిలిశెట్టి నాగభూషణం, పిచ్చెట్టి రాజు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహార పదార్థాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణానికి చెందిన మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ద్వారా పట్టణ శివారల్లో నివసిస్తున్న నిరుపేదలకు, వలస కార్మికులకు శనివారం ఆహార పదార్థాలు, బిస్కెట్ ప్యాకెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్‌కుమార్ మాట్లాడుతూ తాళ్లూరి శ్రీకృష్ణమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారుడు సత్తిరాజు ఆర్థిక సాయంతో ఆహార పదార్థాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. తమ సంస్థ ద్వారా, నిరుపేదలు, అన్నార్తులకు, బాలలకు, వృద్ధులకు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు.

సత్య దేవునికి వెండి ప్లేట్ బహూకరణ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యదేవునికి దాత ఒకరు వెండి ప్లేటును బహు కరించారు. శనివారం హైదరాబాద్‌కి చెందిన కె.రఘు మోహన్‌గుప్త, శ్రీలేఖ దంపతులు సుమారు రూ.లక్ష విలువ చేసే వెండి ప్లేటును ఇఒ వీర్ల సుబ్బారావుకి అందజేశారు.

పలువురికి కంటి వైద్య పరీక్షలు


ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో శనివారం పద్మావతి ఐ కేర్ ఆసుపత్రి సహకారంతో మంగం జానుప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు వందమందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికిఉచితంగా తమ వైద్యశాలలో శస్త్రచికిత్సలు చేస్తామని పద్మావతి ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.రమేష్ తెలిపారు

రౌతులపూడిలో...

మండలంలోని రాజవరం గ్రామంలో హైమా నేత్రాలయం ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్లు, మందులు పంపిణీ చేపట్టారు. ఈ శిబిరాన్ని టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి, గ్రామ నాయకులు ప్రారంభించారు.

కార్టూ'నిజం'



ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి - కాకినాడ


సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

రాపిడో యాప్‌తో ఆటో డ్రైవర్ల ఉపాధిని కోల్పోతున్నారని సిఐటియు నాయకులు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆటో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ రంగం జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. రాపిడో యాప్ వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, వారికి వచ్చే ఆదాయం మరింత తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యాప్ ను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక యాప్‌ను తీసుకువచ్చి ఆ యాప్ ద్వారా ఆటో రంగ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. రవాణా రంగ కార్మికులకు ఉరితాడుగా ఉన్న మోటారు వాహన సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆ బోర్డు ద్వారా కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రవాణా రంగా కార్మికులు పనిచేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు ఆదాయం పన్నుల రూపంలో వస్తుందని తెలిపారు. దీని నుంచి కనీసం ఒక్క శాతం ట్రాన్స్‌పోర్ట్ రంగ కార్మికుల శ్రేయస్సు కోసం ఖర్చు చేయాలని కోరారు. కాకినాడ అచ్చంపేట ఏరియాలో ఏర్పాటు చేసిన ఫిట్నెస్ చెకింగ్ అనేది రవాణా రంగ కార్మికులను ఇబ్బందులకు గురి చేసేలా ఉందని, దీనిని తక్షణమే అధికారులు పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సతీష్, వేణుబాబు, నాగు, విజయ, పండు, బాలు, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

వల్లభునికి రూ.3.73 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3.73 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి సత్యనారాయణ తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్లు ద్వారా రూ.2,51,920, అన్నదాన విరాళాల ద్వారా రూ.85,129, కేశఖండన ద్వారా రూ. 6,320, తులాభారం ద్వారా రూ.400, లడ్డు ప్రసాదం ద్వారా రూ.30,135 వెరసి రూ.3,73,904 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

యు.కొత్తపల్లి కూటమి ప్రభు త్వం ద్వారానే పేద కుటుం బాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని పిఠాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అన్నారు. శనివారం మండలంలోని మూలపేట గ్రామంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గత వైసిపి పాలనలో అభివృద్ధిని తుంగలోకి తొక్కారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ జడ్‌పిటిసి బత్తుల చైతన్యరాజేష్, మెరుగు సూరిబాబు, కంబాల వెంకటరమణ, రాజారావు, నాగేశ్వరరావు, మహేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **పెద్దాపురం**పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకటరావు, టిడిపి నాయకులు సమ్మంగి శివ, రేలంగి రాజశేఖర్, గెడ్డం అర్జున్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కాకినాడ** నగరంలోని 7వ డివిజన్‌లో ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి సత్యనారాయణచిన్న, బొచ్చా దాసు, కొల్లు కుమారి, కోలా ఎల్లారావు, తాజీద్దీన్, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** నగరంలోని 7వ డివిజన్‌లో ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి సత్యనారాయణచిన్న, బొచ్చా దాసు, కొల్లు కుమారి, కోలా ఎల్లారావు, తాజీద్దీన్, తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** పట్టణంలోని 14, 18 వార్డులలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. అలాగే ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, నాయకులు అడబాల కుమారస్వామి, యార్లగడ్డ రవిచంద్రప్రసాద్, కంటే జగదీశ్‌మోహన్, బలుసు వాసు, వల్లూరి దొరబాబు పాల్గొన్నారు.


మహిళలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎంఎల్‌ఎ వర్మ

నేరాలు ఘోరాలు



చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి కృష్ణారావు

బంగారం చోరీ కేసులో నిందితుని అరెస్ట్

రూ.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

ఇంటిలో నమ్మకంగా ఉంటూ దాదాపు రూ.50 లక్షల విలువైన బంగారాన్ని దోచుకున్న ఇంటి దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంట్లో నమ్మకంగా పని చేస్తూ ఈ నేరానికి పాల్పడ్డాడు. వారం రోజుల్లోనే నిందితుడిని పట్టుకొన్న రామచంద్రపురం పోలీసులు నిందితుడిని వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్‌పి కృష్ణారావు పాత్రికేయులకు శనివారం వివరించారు. రామచంద్రపురం జడ్‌పి స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న దొంతంశెట్టి శ్రీనివాస్ రామచంద్రపురం రామదుర్గ వీధి, శోభా హాస్పిటల్ వెనుక నివాసం ఉంటున్నాడన్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా విశాఖపట్నం వెళ్లి 7న రామచంద్రపురానికి తిరిగి వచ్చారని ఎస్‌పి తెలిపారు. చోరీ విషయాన్ని శ్రీనివాస్ తెలుసుకున్నాడని అన్నారు. ఇంటి ప్రధాన ద్వారం స్క్రూడ్రైవర్‌తో తెరిచి, తలుపు హ్యాండిల్ తీసివేసి, లోపలికి నిందితుడు ప్రవేశించాడని ఎస్‌పి తెలిపారు. ఇంటిలో రూ.50 లక్షల బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. దర్యాప్తు చేయగా ఇంటిలో పని చేసే దేవగుప్తం వీరభద్రరావు పై అనుమానం వచ్చింది. అతని అదుపులోనికి తీసుకుని ప్రశ్నించగా చోరీ విషయం వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. రామచంద్రపురం డిఎస్‌పి రఘువీర్ నేతృత్వంలో రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ, క్రైమ్ సిఐ గజేంద్ర కుమార్, రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు, ఎఎస్ఐ బాలకష్ణ, హెడ్ కానిస్టేబుల్ వీరబాబు, కానిస్టేబుల్ సూరిబాబు తదితరులు ఈ నేరాన్ని చేధించారని ఎస్‌పి తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఎస్‌పి అభినందించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - రాజానగరం

కుటుంబంలో గొడవలతో భార్య పుట్టింటికి వెళ్ళడంతో మనస్తాపం చెంది భర్త ఉరేసుకున్న సంఘటన కొంతమూరులో శనివారం చోటు చేసుకుంది. రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. డెంటల్ టెక్నీషియన్ గొర్ల గోవిందరావు (44)కు తాళ్లూరుకు చెందిన విజయతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భార్య కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గోవిందరావు కొంతమూరులోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడుకి కుమారుడు కుమార్తె ఉన్నారు.


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

రఘుదేవపురంలో భారీ చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం రవీంద్ర కాలనీలో ఒక ఇంట్లో భారీ చోరీ చోటు చేసుకుంది. ఇంటి యజమానులు బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఇంట్లోకి చొరబడిన దొంగలు రూ.లక్షల నగదుతో పాటు బంగారం, వెండి వస్తువులను అపహరించారు. రవీంద్ర కాలనీకి చెందిన సురవరపు మణికంఠ తన తల్లి ఈశ్వరితో కలిసి ఉంటున్నారు. రెండు వారాల క్రితం నిడదవోలులో బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో శనివారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా, ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటం చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.లక్షా తొంభై వేల నగదు, 4 కాసుల బంగారు బిస్కెట్లు, 30 తులాల వెండి పట్టీలు, 60 తులాల వెండి కుంకుమ భరణి, వెండి చెంబులు కూడా దొంగలించినట్టు గుర్తించారు. పోలీసులు క్లూస్ టీమును రప్పించి దర్యాప్తు చేస్తున్నారు

ఆలమూరు ఎంఎంసి అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆ పార్టీ తరుపున మండలంలోని మడికి కి చెందిన కొత్తపల్లి వెంకటలక్ష్మిని కూటమి ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. దీంతో శనివారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు నివాసానికి వాడపాలెం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఆమెతోపాటు జనసేన పార్టీ తరపున ఎన్నికైన ఎఎంసి డైరెక్టర్లు జొన్నాడకు చెందిన చింతలపూడి శ్రీనివాస్ కుమార్, చొప్పెల్ల కు చెందిన తోరాటి సత్య కిషోర్, కలవచర్లకు చెందిన గుత్తుల నాగేశ్వరరావు, మూలస్థానం అగ్రహారానికి చెందిన దండా శ్రీదేవి నేత శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు సూరపురెడ్డి సత్య, జనసేన నేతలు కొత్తపల్లి నగేష్, సలాది జెపి, నాగిరెడ్డి మహేష్ పాల్గొన్నారు.

'ఉప్పాడ చేనేత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి'

ప్రజాశక్తి - కాకినాడ

దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఉప్పాడ చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎంపి తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యు.కొత్తపల్లి మండలంలో ఉప్పాడతో పాటు అనేక గ్రామాల్లో చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఆదుకునేందుకు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నుంచి నిధులు మంజూరు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్రానికి లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ పథకం అమలైతే రూ.15 కోట్లు నిధులు మంజూరు అవుతాయని, ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.12 కోట్లు కాగా మిగిలిన 3 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ నిధులతో ఉప్పాడలో చేనేత రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా అభివృద్ధి చేయడంతో పాటు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 700 మంది చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలుగుతున్నారు. నిధులు మంజూరు కోసం పలుమార్లు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరి రాజ్ సింగ్‌ను వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. వీవర్స్ సర్వీస్ సెంటర్ జోనల్ డైరెక్టర్ నేతృత్వంలో సాంకేతిక కమిటీని త్వరలోనే ఉప్పాడలో పర్యటించి నివేదిక అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. సాంకేతి కమిటీ ఉప్పాడ తదితర గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తుందని, ఆ నివేదిక ఆధారంగా కేంద్రం నిధులు విడుదల చేస్తుందన్నారు.

కౌలు రైతులకు రుణార్హత కార్డులు అందించాలి

ప్రజాశక్తి - కాజులూరు

సేద్యం చేసే కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు అందించాలని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మంజెరు, చేదువాడ, తిప్పరాజుపాలెం, ఐతపూడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వడం చాలా ఆలస్యమైందని అన్నారు. మండలంలో 6200 మందికి కౌలు రైతులు గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 1200 మందికి మాత్రమే ఇచ్చారని అన్నారు. కౌలు గుర్తింపు కార్డులు త్వరితగతిన ఇవ్వాలని అధికారులకు పలు దఫాలుగా కోరినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కౌలు రైతుకు రుణ అర్హత కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎంఎల్‌ఎ తనయునికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ తనయుడు సాయివర్షిత్ విదేశాల్లో చదువుకుంటూ శనివారం తన స్వగ్రామం పెద శంకర్లపూడి గ్రామానికి విచ్చేసిన సందర్భంగా రాజమహేంద్ర వరం విమానాశ్రయంలో నియోజకవర్గ టిడిపి శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. గత ఎన్నికల్లో వరుపుల సత్యప్రభ విజయానికి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె విజయం సాధించిన అనంతరం సాయివర్షిత్ విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి అమెరికా వెళ్లారు. తిరిగి స్వగ్రామం రావడంతో భారీ ఎత్తున స్వాగతం పలికారు. పెద శంకర్లపూడిలో తన తండ్రి వరుపుల రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బద్ది రామారావు, వెన్నా శివ, కోరుకొండ నూకరాజు, గొల్లపల్లి బుజ్జి, యాళ్ళ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.


సాయివర్షిత్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

జీవన రేఖలు కథా సంపుటి గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

సాహితీ స్రవంతి ఆధ్వర్యాన శనివారం స్థానిక గాంధీభవన్‌లో ఇంద్రగంటి నరసింహమూర్తి రచించిన జీవన రేఖలు కథా సంపుటి పరిచయ సభ జరిగింది. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించగా, గనారా గ్రంథావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ ఇంద్రగంటి నరసింహమూర్తి సమకాలీన సామాజిక అంశాలపై కథలు వ్రాస్తూ, మానవ సంబంధాలను, భావోద్వేగాలనూ చక్కగా పండిస్తారని అన్నారు. పి.పద్మజవాణి సమీక్షిస్తూ మానవతా విలువలను తట్టిలేపే సంస్కారం, ఆశావహ దృక్పథం కలిగిన 24 కథల సమాహారమే ఈ జీవనరేఖలు అంటూ ప్రశంసించారు. ఇందిర మాట్లాడుతూ మధ్యతరగతి మధుర హాసాలకు, ఆరోగ్యకరమైన హాస్యానికి, నైతిక విలువల ప్రాధాన్యతకు నిలువెత్తు సంతకాలు ఇంద్రగంటి కథలు అన్నారు. రచయిత ఇంద్రగంటి నరసింహమూర్తి స్పందన తెలియజేస్తూ నిరంతరం నిబద్ధతతో సాహిత్యానికి పట్టం కడుతున్న సాహితీ స్రవంతి కాకినాడ శాఖ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మార్ని జానకిరామ చౌదరి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో గరికపాటి మాస్టారు, డాక్టర్ శైలజ, శుభశ్రీ, అద్దేపల్లి జ్యోతి, సావిత్రీ ప్రసాద్, మాకినీడి సూర్యభాస్కర్, అద్దేపల్లి ప్రభు, అవధానుల మణిబాబు, సాయి సత్యనారాయణ, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, చింతపల్లి సుబ్బారావు, మద్దాలి సత్యనారాయణ, ప్రభాకర వర్మ, పెండ్యాల కామేశ్వరరావు, శిరీష, పి.రామస్వామి, పెద్దింశెట్టి రామకృష్ణ, మోహనరావు, రవిచంద్ర, సి.ఎస్. వెంకట నారాయణ తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక పోలీస్ స్టేషన్లో ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలను నడిపే ఆటో డ్రైవర్లు మద్యం సేవించరాదని, సెల్ ఫోన్‌తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. ప్రతి వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉండాలని, ఇన్సూరెన్స్ విధిగా చేయించాలన్నారు.

స్విమ్మింగ్ పూల్‌పై ఆర్ఎఒకు వినతి

ప్రజాశక్తి - యానాం

స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న స్విమ్మింగ్ పూల్ దుస్థితిపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్ ఆర్ఎఒ మునిస్వామికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా సంబంధిత అధికారులు, సిబ్బంది స్విమ్మింగ్ పూల్‌ను పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా స్విమ్మింగ్ పూల్‌లో నీరు పచ్చగామారి, కప్పలు, కీటకాలు చేరి దుర్గంధం వ్యాపిస్తోందని వివరించారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెల్లం చిన్న, చెక్కల అరుణ్ కుమార్, గణేష్, వైదాడి శ్రీనివాస్, సింహాద్రి, విజయ్‌వర్మ పాల్గొన్నారు.

రూ.2.75 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - యానాం

యానాంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.2.75 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రంగస్వామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పాటు, భక్తుల విరాళాలు కలిపి టిటిడికి అందజేస్తామన్నారు


రొట్టెలు పంపిణీ చేస్తున్న ఎసి విజయలక్ష్మి

పాలు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతరకు వచ్చిన యాత్రికులకు సామర్లకోట రోటరీ క్లబ్ సభ్యులు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు తటవర్తి సత్యనారాయణ, సభ్యులు డి గంగాధరుడు, నాగరాజు, సుధాకర్, చలం, రోటరీ సామ్రాజ్య సభ్యులు ఉప్పల సోమ రాజు, బొండా ఆదిత్య, ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కరప

మండలంలోని గొర్రిపూడి గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి వీరబాబు తెలిపారు. జి.వేమవరం గ్రామంలో ఒహెచ్ఆర్ఎస్ మంచినీటి చెరువు పనులు జరుగుతున్నందున గొర్రిపూడి గ్రామానికి నీటి కొరత లేకుండా, కోస్టల్ ఆక్వా కంపెనీ, రామలింగేశ్వర రైస్ మిల్ సహకారంతో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : బొత్స

ప్రజాశక్తి - కిర్లంపూడి

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఉభయగోదావరి జిల్లాల వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం కిర్లంపూడిలో వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అధ్యక్షతన నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా కన్పిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేసే అరాచకాలను ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లో ప్రజలకు వివరించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేలా త్వరలో కార్యచరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తోట నరసింహం, మాజీ ఎంపి వంగా గీత, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా, మాజీ ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు, పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, మాజీ ఎంఎల్‌సి అంగూరి లక్ష్మీశివకుమారి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ఉపాధ్యాయులకు వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

యుటిఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో ట్రస్ట్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శనివారం స్థానిక యుటిఎఫ్ హోంలో నిర్వహించిన ఈ శిబిరంలో డివైఇఒ ఎన్ వెంకటేశ్వరరావు, ఎంఇఒలు కెవివి.సత్యనారాయణ, చెవ్వూరి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ హాస్పిటల్ కార్డియాక్ డాక్టర్ వి.సురేశ్వర్ ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తోటకూర రవిచక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా అధ్యక్షులు చేదులూరి సూరిబాబు, నగర ప్రధాన కార్యదర్శి బి.రవిశ్రీనివాస్, సిహెచ్.రమేష్, ఇమ్మానుయేల్, వజ్రపు మహేష్, కె.దుర్గాశ్రీనివాస్, కాజులూరు సుధీర్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్‌వి.రమణ తదితరులు పాల్గొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి డాక్టర్ సురేశ్వర్ వైద్య సలహాలను అందించారు.


శిబిరంలో వైద్య సేవలందిస్తున్న వైద్య బృందం

కాలువల అభివృద్ధికి సహకారం అవసరం

ప్రజాశక్తి - కాజులూరు

పంట కాలువల అభివృద్ధిలో రైతుల సహకారం అవసరమని కాజులూరు సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షులు లకాని కృష్ణచైతన్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. చేదువాడ, శీల, మంజేరు గ్రామాల పరిధిలోని పంటకాలవలను సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పంట కాలువల పరిధిలో రైతులు, కౌలు రైతులు ఎటువంటి ఆక్రమణలకు పాల్పడకుండా, పాల్పడే వారిని నిరోధించాలన్నారు. కొంతమంది రైతులు పంటకాలువలలో పశు కళేబరాలు, అరటి చెట్లను వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయని అన్నారు. కావున రైతులు సహకరించాలని కోరారు.

టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధం

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలో టిడిపి, వైసిపిలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుంది. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట వద్ద ఇటీవల జరిగిన వైసిపి నియోజకవర్గ సమావేశంలో ఆ పార్టీ యువనాయకులు తోట రాంజీ స్థానిక ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూపై విమర్శలు చేశారు. ఆ విమర్శలకు టిడిపి యువనాయకులు స్పందించారు. దానికి వైసిపి ద్వితీయ శ్రేణి నాయకులు ఘాటు విమర్శలు చేశారు. మట్టి, ఇసుక దోపిడి చేస్తున్నారనే ఆరోపణలను గుప్పిస్తున్నారు. కిర్లంపూడి మండలం కృష్ణవరంలో ఐఎస్‌ఎల్‌లో అవినీతి జరిగిందని వైసిపి నాయకులు కరుటూరి శ్రీను, రావుల గణేష్‌రాజా ఆరోపించారు. వాటిని నిరూపించాలంటూ టిడిపి కృష్ణవరం నాయకులు బోధిరెడ్ల సుబ్బారావు సవాల్ విసిరారు. అలాగే వైసిపి హయాంలో రైస్ మిల్లు వ్యాపారి పిడిఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి చీకటి వ్యాపారం చేశారని ఆరోపించారు. ఆ ఆరోపణలపై శనివారం రైస్ మిల్లు వ్యాపారి కరుటూరి వీర్రాజు ఖండించారు. నేను ధాన్యం కొనుగోలు చేస్తూ లక్షల్లో ట్యాక్స్ కడుతున్నానని చెప్పుకొచ్చారు. మార్కెట్ కమిటీ మీ ఆధీనంలో ఉంది కాబట్టి చూసుకోవాలని హితవు పలికారు. ఇలా టిడిపి, వైసిపి నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగడంతో నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి మాట్లాడుతూ సంక్షేమ సంఘం ఆధ్వార్యాన ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్నామని అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాటి మానవుల పట్ల ప్రేమతో వ్యవహరించాలని అన్నారు. ఈ సందర్భంగా అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో వెంకట దుర్గావతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరి, కవిత, మానస, పద్మా మోహన్, దీపిక, మాధవి లత, రత్నం, లక్ష్మీసృజన, మోహిని, ఎంవిఎస్ఎల్.ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చిన జగ్గంపేట గ్రామంలో పిహెచ్‌సి ఆధ్వర్యంలో శనివారం అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. ఒఆర్ఎస్, జింకు మాత్రలు, ఇంటిలో లభించే సీతల పానీయాలు, పొంగు నీరు, బార్లీ, ఉప్పు, పంచదార కలిపిన నీరు, తల్లి పాలు నిరంతరం ఇస్తూ పిల్లలకు డిహైడ్రేషన్ రాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అహ్మద్ భాష, రజిమ్ బీమ్, ప్రశాంతి, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

23న చీరా సారె ఉత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర ఆలయంలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారికి ఈనెల 23వ తేదీన చీరా సారె ఉత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణ అధికారి బల్ల నీలకంఠం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక స్టేషన్స్ సెంటర్లోని నూకాంబిక అమ్మవారి ఆలయం నుంచి లక్ష పసుపు కొమ్ములతో చీర సారెతో ప్రత్యేక ఉత్సవం ద్వారా భీమేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని వాటిని అమ్మవారికి సమర్పిస్తామని అన్నారు. ఈ పూజలకు గాను అమ్మవారికి కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, చీరలు, పసుపుకొమ్ములు అందించే భక్తులు ముందుగా ఆలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.